సాక్షి నిజామాబాద్

సోమవారం। 4। డిసెంబర్। 2023



నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యేలుగా పోటీచేసిన అభ్యర్థులు పేర్కొన్నారు.

- 12లో ▸



ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు

నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ఆదివారం ప్రశాంతంగా ముగిసింది.

- 12లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.9 /19.5

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతం కావొచ్చు. సాయంత్రం చల్లటి గాలులు వీస్తాయి. రాత్రి పొగమంచు కురుస్తుంది.

కాంగ్రెస్‌లో జోష్..

ఉత్కంఠగా ఫలితాలు

- కాంగ్రెస్ 4, బీజేపీ 3, బీఆర్ఎస్ 2
- కేసీఆర్, రేవంత్‌లకు ఏకకాలంలో ఓటమి రుచి చూపించిన బీజేపీ
- జాతీయ నేతల ప్రచారంతో లబ్ధి
- ఉమ్మడి జిల్లా నుంచి ఆరుగురికి కొత్తగా శాసనసభలోకి అవకాశం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెల్లడించడంతో ఉత్కంఠ వీడింది. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కొన్ని నియోజకవర్గాలకు సంబంధించి రౌండ్‌రౌండ్‌కు నెలకొన్న టెన్షన్ మధ్యాహ్నానికి వీడింది. రాష్ట్రంలో అధికారమార్పిడి జరగ్గా, ఆ అధికారాన్ని హస్తగతం చేసుకున్న కాంగ్రెస్ ఉమ్మడి జిల్లాలో 4 స్థానాలను కైవసం చేసుకుంది.

▪ కాంగ్రెస్ తరుపున రూరల్ నుంచి డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి, బోధన్ నుంచి పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, ఎల్లారెడ్డి నుంచి మదన్‌మోహన్‌రావు, జుక్కల్ నుంచి లక్ష్మీకాంతరావు విజయం సాధించారు.

▪ బీజేపీ తరుపున నిజామాబాద్ అర్బన్ నుంచి ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్ నుంచి పైడి రాకేష్‌రెడ్డి, కామారెడ్డి నుంచి కాటిపల్లి వెంకటరమణారెడ్డి విజయకేతనం ఎగురవేశారు.

▪ బీఆర్ఎస్ సిట్టింగ్‌లైన బాన్సువాడ నుంచి పోచారం శ్రీనివాస్ రెడ్డి, బాల్కొండ నుంచి వేముల ప్రశాంత్‌రెడ్డి గెలుపొందారు.

▪ ఉమ్మడి జిల్లాలోని 9 నియోజకవర్గాల్లో త్రిముఖ పోరు కారణంగా అన్ని చోట్లా ప్రతి రౌండ్ విషయమై టెన్షన్ నెలకొంది. ఉత్కంఠ భరిత లెక్కింపులో సిట్టింగ్ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి తక్కువ మెజారిటీలతో గట్టెక్కారు. ఒక దశలో వీరిద్దరికీ ఓటమి తప్పదనే వాతావరణం ఏర్పడింది. దీంతో వీరిద్దరూ గెలుపు తీరం చేరేందుకు చివరి రౌండ్ వరకూ వేచిచూడాల్సి వచ్చింది.



బోధన్ పట్టణంలో సోనియాగాంధీ, రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

కేవీఆర్ సంచలన విజయం

రాష్ట్రం, జాతీయ స్థాయిలోనే అత్యంత ఆసక్తి, ఉత్కంఠ కలిగించిన కామారెడ్డి నియోజకవర్గం విషయమై లెక్కింపు మరింత ఉత్కంఠను కలిగించింది. చివరకు చరిత్రలో నిలిచిపోయేలాంటి తీర్పును కామారెడ్డి నియోజకవర్గ ప్రజలు ఇచ్చారు. ఈ ఫలితం జాతీయ స్థాయిలో సంచలనం కలిగించింది. సీఎం కేసీఆర్ చివరి వరకు మూడో స్థానంలో రాగా, రేవంత్‌రెడ్డి ఆధిక్యంలో కొనసాగుతూ వచ్చారు. దీంతో ప్రతి రౌండ్‌కు టెన్షన్ కొనసాగుతూ వచ్చింది. చివరకు రేవంత్‌రెడ్డి మూడోస్థానానికి రాగా, కేసీఆర్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నారు. అనూహ్యంగా బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి సంచలనాత్మక విజయం సాధించారు. అయితే వెంకటరమణారెడ్డికి 6,741 ఓట్ల ఆధ్యింతో విజయం దక్కగా, కేసీఆర్, రేవంత్‌రెడ్డికి వచ్చిన ఓట్ల తేడా కేవలం 4,995 మాత్రమే ఉండడం గమనార్హం. ఉమ్మడి జిల్లా నుంచి ఆరుగురికి కొత్తగా శాసనసభలో అడుగుపెట్టే అవకాశాన్ని ఓటర్లు కల్పించారు.



అభివాదం చేస్తున్న కిషన్ రెడ్డి, కేవీఆర్

▪ జుక్కల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సిందే మొదటి నుంచి ఆధిక్యంలో కొనసాగినప్పటికీ చివరి రౌండ్‌కు వచ్చేవరకు ఓటమి చెందారు. కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీకాంతరావు స్వల్ప ఆధిక్యంతో గట్టెక్కారు.

▪ నిజామాబాద్ రూరల్, ఎల్లారెడ్డిల్లో కాంగ్రెస్ అభ్యర్థులు డాక్టర్ భూపతిరెడ్డి, మదన్‌మోహన్‌రావులు ఆది నుంచి ఆధిక్యంలో కొనసాగుతూనే వచ్చారు. వీరిద్దరూ భారీ తేడాతో గెలుపొందారు.

▪ నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ బీజేపీ అభ్యర్థులు సైతం మొదటి నుంచీ స్పష్టమైన ఆధిక్యంతో ముందంజలో నిలుస్తూ వచ్చారు. వీళ్ల భారీ మెజారిటీతో గెలుపొందగా, కాంగ్రెస్ అభ్యర్థులు ద్వితీయస్థానంలో, బీఆర్ఎస్ అభ్యర్థులు మూడోస్థానంలో నిలిచారు.

▪ ఇక బాన్సువాడ నుంచి బీఆర్ఎస్ సిట్టింగ్ పోచారం సైతం ఆది నుంచి పూర్తి ఆధిక్యంతో వచ్చి చివరికి మంచి మెజారిటీతో విజయం సాధించారు.



అభివాదం చేస్తున్న ధన్‌పాల్ సూర్యనారాయణ



కౌంటింగ్ హాల్ వద్ద మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

నియోజకవర్గం : నిజామాబాద్ అర్బన్

అభ్యర్థి	వచ్చిన ఓట్లు	పార్టీ
ధన్‌పాల్ సూర్యనారాయణ	75,240	బీజేపీ
మహ్మద్ అలీ షబ్బీర్	59,853	కాంగ్రెస్
బిగాల గణేశ్ గుప్తా	44,829	బీఆర్ఎస్

మెజార్టీ 15,387

నియోజకవర్గం : నిజామాబాద్ రూరల్

అభ్యర్థి	వచ్చిన ఓట్లు	పార్టీ
ఆర్. భూపతి రెడ్డి	78,378	కాంగ్రెస్
బాజిరెడ్డి గోవర్ధన్	56,415	బీఆర్ఎస్
కులాచారి దినేశ్	49,723	బీజేపీ

మెజార్టీ 21,963

నియోజకవర్గం : ఆర్మూర్

అభ్యర్థి	వచ్చిన ఓట్లు	పార్టీ
పైడి రాకేశ్ రెడ్డి	72,658	బీజేపీ
వినయ్‌కుమార్ రెడ్డి	42,989	కాంగ్రెస్
ఆశన్నగారి జీవన్ రెడ్డి	39,395	బీఆర్ఎస్

మెజార్టీ 29,669

నియోజకవర్గం : బాల్కొండ

అభ్యర్థి	వచ్చిన ఓట్లు	పార్టీ
వేముల ప్రశాంత్‌రెడ్డి	70,417	బీఆర్ఎస్
ముత్యాల సునీల్ రెడ్డి	65,884	కాంగ్రెస్
ఏలేటి అన్నపూర్ణమ్మ	30,250	బీజేపీ

మెజార్టీ 4,533

నియోజకవర్గం : బోధన్

అభ్యర్థి	వచ్చిన ఓట్లు	పార్టీ
పి. సుదర్శన్‌రెడ్డి	66,963	కాంగ్రెస్
షకీల్ అహ్మద్	63,901	బీఆర్ఎస్
వడ్డీ మోహన్‌రెడ్డి	33,555	బీజేపీ

మెజార్టీ 3,062

ప్రజలకు రుణపడి ఉంటా..

బాన్సువాడ: స్పీకర్లు ఓడిపోతారనేది కేవలం అపోహ మాత్రమేనని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం మాట్లాడారు. నిత్యం ప్రజలతో కలిసి ఉన్నాను కాబట్టే వారు చరిత్రను తిరగరాస్తూ నన్ను గెలిపించారన్నారు.

నియోజకవర్గం : కామారెడ్డి

అభ్యర్థి	వచ్చిన ఓట్లు	పార్టీ
కాటిపల్లి వెంకటరమణారెడ్డి	66,652	బీజేపీ
కే చంద్రశేఖర్‌రావు	59,911	బీఆర్ఎస్
ఎనుముల రేవంత్‌రెడ్డి	54,916	కాంగ్రెస్

మెజార్టీ 6,741

నియోజకవర్గం : జుక్కల్

అభ్యర్థి	వచ్చిన ఓట్లు	పార్టీ
తోట లక్ష్మీకాంత్‌రావు	64,489	కాంగ్రెస్
హన్మంత్ సింధే	63,337	బీఆర్ఎస్
అరుణతార	28,437	బీజేపీ

మెజార్టీ 1,152

నియోజకవర్గం : బాన్సువాడ

అభ్యర్థి	వచ్చిన ఓట్లు	పార్టీ
పోచారం శ్రీనివాస్‌రెడ్డి	76,278	బీఆర్ఎస్
ఏనుగు రవీందర్‌రెడ్డి	52,814	కాంగ్రెస్
యెండల లక్ష్మీనారాయణ	23,685	బీజేపీ

మెజార్టీ 23,464

నియోజకవర్గం : ఎల్లారెడ్డి

అభ్యర్థి	వచ్చిన ఓట్లు	పార్టీ
మదన్‌మోహన్‌రావు	86,989	కాంగ్రెస్
జాజాల సురేందర్	62,988	బీఆర్ఎస్
వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి	27,000	బీజేపీ

మెజార్టీ 24,001

తగ్గిన నోటా ఓట్లు

- పార్టీలకే ఓట్లేసిన ప్రజలు

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలో ప్రస్తుతం జరిగిన సాధారణ ఎన్నికల్లో నోటా ఓట్లు గతంలో కంటే తగ్గాయి. 2018లో జరిగిన ఎన్నికల్లో ఆరు నియోజకవర్గాల్లో మొత్తం 10,018 ఓట్లు నమోదు కాగా, ప్రస్తుతం జరిగిన 7,351ఓట్లు నమోదయ్యాయి. 2,667 ఓట్లు తగ్గాయి.

నియోజకవర్గం	2018 నోటా	ప్రస్తుత ఓట్లు
నిజామాబాద్ అర్బన్	855	538
బోధన్	1,862	872
ఆర్మూర్	1,657	1,499
బాన్సువాడ	1,555	1,012
నిజామాబాద్ రూరల్	2,203	2,268
బాల్కొండ	1,886	1,162
మొత్తం	10,018	7351

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు..

ఆరు నియోజకవర్గాల్లో 8,329 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదయ్యాయి. అత్యధికంగా అర్బన్‌లో 2,514, బోధన్‌లో 1,123, ఆర్మూర్ 2,075, బాన్సువాడలో 1,415, రూరల్‌లో 1,494, బాల్కొండలో 1783 ఓట్లు నమోదయ్యాయి.



క్లుప్తంగా

సేవకుడిగా పనిచేస్తా

- బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్: మూడో సారి ఎమ్మెల్యేగా గెలిపించిన బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని, కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలుకు పోరాడుతానని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం పేర్కొన్నారు. తన గెలుపుకోసం అహర్నిశలు కష్టపడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. విపక్షాలు తనపై, తన కుటుంబంపై విష ప్రచారాలు చేసినా నమ్మకుండా ప్రజలు గెలిపించారని పేర్కొన్నారు. ప్రత్యర్థులు గంజాయి వ్యాపారం చేస్తున్నామని తనపై అబద్ధపు ప్రచారాలు చేసినా ఊరుకున్నానన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల అబద్ధపు ప్రచారాలకు పాల్పడి ప్రజలను గందరగోళానికి గురి చేయడంతో మెజారిటీ తగ్గింది కాని నా విజయాన్ని ఆపలేకపోయారన్నారు.

వెలవెలబోయిన 'బీఆర్‌ఎస్' కార్యాలయం



నిజామాబాద్‌నాగారం: అసెంబ్లీ ఎన్నికల తుది ఘట్టమైన ఓట్ల లెక్కింపులో బీఆర్‌ఎస్ ఘోర పరాజయం కావడంతో స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయం నాయకులు, కార్యకర్తలు లేక వెలవెలబోయింది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలైన నిజామాబాద్ అర్బన్, రూరల్, ఆర్మూర్, బోధన్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఓడిపోగా బాల్కొండ అభ్యర్థి ప్రశాంత్‌రెడ్డి స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. నిన్నటి వరకు భారీ మెజార్టీతో గెలుస్తుందనుకున్న పార్టీ శ్రేణులు ఆదివారం నిర్వహించిన ఓట్ల లెక్కింపులో తలకిందులు కావడంతో పార్టీ కార్యాలయానికి రావడానికి నాయకులు, కార్యకర్తలు సుముఖత చూపలేదు.

ప్రజా సంక్షేమమే మా ధ్యేయం



ఖలీల్‌వాడి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం అనేది శుభసూచకమని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో జరిగిన విజయాలను, అపజయాలను స్వీకరిస్తూ మాజీ మంత్రివర్యులు సుదర్శన్ రెడ్డి నాయకత్వంలో జిల్లాలో ప్రజా సంక్షేమమే దిశగా కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళ్తుందన్నారు. జిల్లాలో బీఆర్‌ఎస్ నాయకులు చేసిన ఆగడాలను, అవినీతిని సమీక్షిస్తూ మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి నాయకత్వంలో ప్రజారంజక పాలన అందిస్తామని తెలిపారు.

నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

- రెట్టింపు ఉత్సాహంతో నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తాం
- పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడిన ప్రజలు
- ఆనందోత్సాహాల్లో బీజేపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

సాక్షి నెట్‌వర్క్: ఏ నమ్మకంతో ప్రజలు అధికారం కట్టబెట్టారో అదే నమ్మకంతో నియోజకవర్గాలను మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ఎన్నికల్లో తుది ఘట్టమైన ఓట్ల లెక్కింపులో ప్రజలు అనూహ్యరీతిలో తమ ఓటు తీర్పును వెల్లడించారు. జిల్లాలో గత పదేళ్లుగా ఒకే పార్టీకి పట్టం కట్టిన ప్రజలు ఈ సారి తమ ధోరణి మార్చుకున్నారు. ఆయా నియోజకవర్గ ప్రజలు బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించారు. దీంతో గెలిచిన అభ్యర్థులు తమ ప్రాంతాలను రెట్టింపు అభివృద్ధి చేసి చూపుతామని, ఓడిన అభ్యర్థులు ఓటర్ల తీర్పును శిరసావహిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో గెలిచిన, ఓడిన తాజా, మాజీ ఎమ్మెల్యేలు, పలువురు తమ ఎన్నికల మనోభావాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

స్మార్ట్‌సిటీగా మారుస్తా..



నగరాన్ని స్మార్ట్‌సిటీగా మార్చి ఆదర్శంగా తీర్చిదిద్దుతా. అర్బన్ సూరన్న గెలిచాడంటే ఇందూరు ప్రజలు గెలిచినట్లే.. ఇళ్లు లేని పేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు, ఆరు నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహిస్తాం. ప్రజలకు సేవచేసే అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నా. నా విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు.

– ధన్‌పాల్ సూర్యనారాయణ

రూరల్‌లో కక్ష సాధింపులు ఉండవు



ఇకపై రూరల్ నియోజకవర్గంలో రాజకీయ కక్ష సాధింపులు ఉండవు. నన్ను ఎమ్మెల్యేగా గెలిపించి ప్రజలు నాపై బాధ్యత పెంచారు. దాన్ని వమ్ము చేయను. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా. ప్రజలకు ఎల్లప్పుడూ అన్నగా, తమ్ముడిగా అండగా ఉంటాను. పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేశారు. టికెట్ ఇచ్చిన అధిష్టానానికి కృతజ్ఞతలు.

– భూపతిరెడ్డి

మేనిఫెస్టోను అమలు చేస్తాం



తెలంగాణ ప్రకటించిన కాంగ్రెస్ పార్టీని ఈ ఎన్నికల్లో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తాం. తన గెలుపునకు కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు, అధిష్టానానికి కృతజ్ఞతలు. రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం ఉంటుందని ఆశిస్తున్నా.

– సుదర్శన్ రెడ్డి

ఆరునెలల్లో తేలిపోతుంది



ప్రజా తీర్పును శిరసావహిస్తా. ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ తమ పని తీరు ఏంటో ఆరునెలల్లో తేలిపోతుంది. కాంగ్రెస్ పాలనకంటే బీఆర్‌ఎస్ పాలనే బాగుందని ప్రజలు అప్పుడు గుర్తిస్తారు. కాంగ్రెస్ ఆరు హామీలను నెరవేర్చాలంటే రాష్ట్రాన్ని అమ్మాల్సి ఉంటుంది. ప్రజల వెంటే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.

– బాజిరెడ్డి గోవర్ధన్

ప్రశ్నించే గొంతుగా ఉంటా



తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసినా రూరల్ ప్రజలు స్పందన బాగానే వచ్చినందుకు సంతోషంగా ఉంది. కేవలం డబ్బుతో నడుస్తున్న ప్రస్తుత రాజకీయాల్లో కార్యకర్తలను, ప్రజలను నమ్ముకుని పోటీలో నిలబడ్డా. స్వల్ప మెజార్టీతో ఓడిపోయినా బాధలేదు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుగా ఉంటా. వచ్చే ఎన్నికల్లో అయినా గెలిపించాలని వేడుకుంటున్నా.

– దినేశ్‌కుమార్

అధికారంలో లేకున్నా..



అధికారం ఉన్నా లేకున్నా మేము తెలంగాణ సేవకులం. కష్టపడి పనిచేసినందుకు బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు. పార్టీ కోసం పని చేసిన సోషల్ మీడియా వారియర్స్‌కు, కోరుట్ల ప్రజలకు ధన్యవాదాలు. గెలిచిన ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు. గత పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రజల కోసం ఎంతో కృషి చేసింది. ప్రజల తీర్పును శిరసావహిస్తాం. తెలంగాణను దేవుడే దీవించాలి.

– కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్సీ



విజయ సంకేతం చూపుతున్న పైడి రాకేశ్‌రెడ్డి



భూపతిరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గెలుపు సంబురాలు

ఎన్నికల్లో పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనకు ప్రజలు చరమగీతం పాడారు. ఈ ఎన్నికల్లో ఇద్దరి బీఆర్‌ఎస్ అభ్యర్థులతో పాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు అవకాశం కల్పించారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. అర్బన్ నుంచి బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ, రూరల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరెడ్డి, ఆర్మూర్ నుంచి బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి, బోధన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి, బాన్సువాడ నుంచి స్పీకర్, బాల్కొండ నుంచి ప్రశాంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందారు. దీంతో అభ్యర్థులు పార్టీ నాయకులతో కలిసి గెలుపు సంబురాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



సంబురాల్లో పాల్గొన్న ధన్‌పాల్ సూర్యనారాయణ, నాయకులు



స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి స్వీటు తినిపిస్తున్న భార్య పుష్పమ్మ



బోధన్‌లో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు



కౌంటింగ్ హాల్ వద్ద మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య కౌంటింగ్
- ఆద్యంతం పర్యవేక్షించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేత

సుభాష్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా పరిధిలోని ఆర్మూర్, బోధన్, బాన్సువాడ, అర్బన్, రూరల్, బాల్కొండ నియోజకవర్గాల్లో పోలైన ఓట్లను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఆదివారం లెక్కించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ యాదిరెడ్డితో కలిసి కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. ఉదయం 5 గంటల నుంచే కౌంటింగ్ కోసం సన్నాహాలు చేపట్టారు. ముందుగా పోస్టల్‌బ్యాలెట్ ఓట్లను లెక్కించిన తర్వాత ఈవీఎంలలో ఓట్లను లెక్కిస్తూ ఫలితాలు వెల్లడించారు. మధ్యాహ్నానికే దాదాపుగా ఆరు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పూర్తికాగా, అధికారుల సూచనల మేరకు ఫలితాలను వెల్లడిస్తూ గెలిచిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆర్మూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలుపొందిన పైడి రాకేష్‌రెడ్డి(బీజేపీ)కి రిటర్నింగ్ అధికారి వినోద్‌కుమార్, బోధన్ సెగ్మెంట్ నుండి గెలుపొందిన పి సుదర్శన్‌రెడ్డి (కాంగ్రెస్)కి రిటర్నింగ్ అధికారి రాజాగౌడ్, బాన్సువాడ నియోజకవర్గం నుంచి విజయం సాధించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి(బీఆర్‌ఎస్)కు ఆ సెగ్మెంట్ రిటర్నింగ్ అధికారి భుజంగరావు, అర్బన్ నుంచి గెలుపొందిన ధన్‌పాల్ సూర్యనారాయణ (బీజేపీ)కు రిటర్నింగ్ అధికారి మకరందు, రూరల్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఆర్ భూపతిరెడ్డి (కాంగ్రెస్)కు రిటర్నింగ్ అధికారి రాజేంద్రకుమార్, బాల్కొండ నియోజకవర్గం నుంచి గెలిచిన వేముల ప్రశాంత్‌రెడ్డి (బీఆర్‌ఎస్)కు ఆ సెగ్మెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

కౌంటింగ్ కేంద్రంలోనే ఉన్నతాధికారులు

వెబ్‌క్యామ్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి తదితరులు ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకూ నిశితంగా పర్యవేక్షించారు. సెల్‌ఫోన్లు, వీడియోలు, కెమెరాలను నిషేధించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఏడీఈ తోట రాజశేఖర్ నేతృత్వంలో ట్రాన్స్‌కో సిబ్బంది చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల విధులను విజయవంతంగా పూర్తిచేసిన అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు కృతజ్ఞతలు తెలిపారు.

ఊపిరిపీల్చుకున్న పోలీసులు

ఖలీల్‌వాడి : జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం ఓట్లలెక్కింపు ప్రశాంతంగా జరగడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాలోని బాల్కొండ, బాన్సువాడ, ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్లు లెక్కించారు. ఇక్కడ మూడంచెల పోలీసు భద్రతను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు 400 పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ బందోబస్తుల్లో 10 మంది ఏసీపీలు, 20 మంది సీఐలు, 60 మంది ఎస్సైలు, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు 310 మంది బందోబస్తులో ఉన్నారని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపునకు వచ్చే కౌంటింగ్ అధికారులు, కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థులను తనిఖీలు చేశారు. ఆరు నియోజకవర్గాల నుంచి వచ్చే వారికి జిల్లాలోని సీఎస్‌ఐ కాలేజీలో పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతాల నుంచే వచ్చే వాహనాలను దారి మళ్లించారు. ఓట్ల లెక్కింపు ప్రాంతంలో 144 సెక్షన్ అమలులో ఉండటంతో గుంపు గుంపులుగా ఉండకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.



ఓట్ల లెక్కింపులో అధికారులు, సిబ్బంది



తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బంది



పోలింగ్ కేంద్రం ఎదుట పోలీసులు



ఓట్లు లెక్కిస్తున్న అధికారులు

నిరాశగా..







కౌంటింగ్ కేంద్రం వద్ద బిగాల గణేశ్ గుప్తా, జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్

నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు హాజరైన అభ్యర్థులు ఓటమి అనంతరం నిరాశతో వెనుదిరిగారు.–సాక్షి ఫొటోగ్రాఫర్,నిజామాబాద్







సునీల్‌రెడ్డి, షకీల్ ఆమేర్, కులాచారి దినేశ్

వ్యత్యాసాలు భారీగానే..

నిజామాబాద్‌అర్బన్: ఉమ్మడి జిల్లాలో గత 2018, ప్రస్తుత ఎన్నికల్లో అభ్యర్థులు సాధించిన ఓట్లలో వ్యత్యాసాలు భారీగానే ఉన్నాయి. గతంలో అర్బన్ ఎమ్మెల్యేగా గెలుపొందిన గణేశ్‌గుప్తా ఈ ఎన్నికల్లో 27,067 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. గతంలో రూరల్ నుంచి పోటీ చేసిన భూపతిరెడ్డి గతంలో కంటే ప్రస్తుతం 20,048 ఓట్లు అధికంగా సాధించారు. బాజిరెడ్డి గోవర్ధన్ గతంలో కంటే ప్రస్తుతం 31,561 ఓట్లు, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి గతంలో కంటే ప్రస్తుతం 2,245 ఓట్లు కోల్పోయారు. గతంలో కంటే బాల్కొండ నుంచి పోటీ చేసిన సునీల్‌రెడ్డి ఈ ఎన్నికల్లో 25,370 ఓట్లు తగ్గాయి. పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడలో గతంలో కంటే 1665 ఓట్లు తగ్గాయి. బోధన్‌లో షకీల్ ఈసారి గతంలో కంటే 10,994 ఓట్లు తగ్గిపోయాయి. సుదర్శన్‌రెడ్డికి 169 ఓట్లు మాత్రమే ఎక్కువగా వచ్చాయి. ఆర్మూర్‌లో జీవన్‌రెడ్డికి గతంలో కంటే ప్రస్తుతం 32,730 ఓట్లు తక్కువగా వచ్చాయి. వినయ్‌కుమార్‌రెడ్డికి 23,390 ఓట్లు పెరిగాయి.

2018, ప్రస్తుత ఎన్నికల్లో అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు

అభ్యర్థి	పార్టీ	నియోజకవర్గం	2018లో ఓట్లు	ప్రస్తుతం
గణేశ్‌గుప్తా	బీఆర్‌ఎస్	ని.అర్బన్	71,896	44,829
భూపతిరెడ్డి	కాంగ్రెస్	ని.రూరల్	58,330	78,378
బాజిరెడ్డి గోవర్ధన్	బీఆర్‌ఎస్	ని.రూరల్	87,976	56,415
వేముల ప్రశాంత్‌రెడ్డి	బీఆర్‌ఎస్	బాల్కొండ	73,662	70,417
సునీల్‌కుమార్	బీఎస్పీ	బాల్కొండ	41,254	65,884 కాంగ్రెస్
పోచారం శ్రీనివాస్‌రెడ్డి	బీఆర్‌ఎస్	బాన్సువాడ	77,943	76,278
షకీల్‌ఆమేర్	బీఆర్‌ఎస్	బోధన్	74,895	63,901
సుదర్శన్‌రెడ్డి	కాంగ్రెస్	బోధన్	66,794	66,963
జీవన్‌రెడ్డి	బీఆర్‌ఎస్	ఆర్మూర్	72,125	39,395
వినయ్‌కుమార్‌రెడ్డి	కాంగ్రెస్	ఆర్మూర్	19,599	42,989
ఏనుగు రవీందర్‌రెడ్డి	బీఆర్‌ఎస్	ఎల్లారెడ్డి	56,362	52,814 బాన్సువాడ
షబ్బీర్ అలీ	కాంగ్రెస్	కామారెడ్డి	63,610	59,853 ని.అర్బన్
వెంకటరమణారెడ్డి	బీజేపీ	కామారెడ్డి	15,439	66,652
హన్మంత్‌సింధే	బీఆర్‌ఎస్	జుక్కల్	77,584	63,337
అరుణతార	బీజేపీ	జుక్కల్	18,840	28,437

రైలు కింద పడి ఆత్మహత్య



కామారెడ్డి క్రైం: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి రైల్వే బ్రిడ్జి సమీపంలో ఆదివారం వెలుగు చూసింది. వేకువజామున 3 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని రైలు రాకను గమనించి రైలుకు ఎదురుగా వెళ్లి అతడు ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు. మృతుడి వయస్సు 35 సంవత్సరాలు ఉండవచ్చని రైల్వే ఎస్సై తావూనాయక్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సత్తా చాటిన తాడ్వాయి గడ్డ

ఎల్లారెడ్డి: తాడ్వాయి మండలంతో అనుబంధం ఉన్న ఇద్దరు నేతలు ఎమ్మెల్యేలుగా గెలుపొందడంతో మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి అసెంబ్లీ స్థానం నుంచి ఇద్దరు దిగ్గజాలను మట్టి కరిపించి గెలిచిన బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డిది తాడ్వాయి మండలం దేమె గ్రామం. తాడ్వాయి మండలంతో తనకు ఎంతో అనుబంధం ఉందని చెప్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందిన మదన్‌మోహన్‌రావు మండలంలోని ఎర్రాపహాడ్‌లోనే తన ప్రాథమిక విద్య.. బాల్యం గడిచిందని గుర్తు చేసుకుంటారు. మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందగా ఈ సారి బాన్సువాడ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేతిలో పరాజయం పాలయ్యారు.

మొరాయించిన ఈవీఎం

నాగిరెడ్డిపేట: ఎల్లారెడ్డి అసెంబ్లీ స్థానానికి సంబంధించి నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రం నం.192 ఫలితాలను అధికారులు ఆఖరులో వెల్లడించారు. సాధారణంగా 14వ రౌండ్‌లో 10వ టేబుల్‌పై 192వ పోలింగ్ కేంద్రంలోని ఈవీఎంలోని ఓట్లను లెక్కించాల్సి ఉంది. కానీ ఆ సమయంలో ఈవీఎం మొరాయించడంతో 20రౌండ్లు పూర్తయిన తర్వాత చివరలో 192వ పోలింగ్‌కేంద్రానికి సంబంధించిన ఈవీఎం ఫలితాలను వీవీ ప్యాట్‌లోని స్లిప్‌ల ద్వారా వెల్లడించారు. ఇందులో మొత్తం 509ఓట్లుండగా వాటిలో కాంగ్రెస్‌కు 317ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 147ఓట్లు, బీజేపీకి 31ఓట్లు వచ్చాయి. మిగతా ఓట్లు ఇతరులకు పడ్డాయి.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

CHANGE OF NAME

I, NATTA SWAROOPA (Old Name) R/o Armoor. Hence Changed my Name as a PANDIRI SWAROOPA RANI (New Name) W/o. NATTA PEDDA BABANNA [Z-799653]

WANTED

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం జీ: 18K ఫోన్ : 9640258899/ 9640468899 [H-793659]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.